క్లుప్తంగా


ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం



పీర్లచావిడి ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మార్టూరు: 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేయనున్న అభ్యర్థుల కోసం పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక పీర్ల చావిడి ప్రాంతానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు రుక్సానా బేగం, వార్డు నంబర్ మాబు లాలు గన్నవరం రోడ్డు తదితర ప్రాంతాల్లో పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు స్లిప్పులు పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గద్దం మస్తాన్‌వలి, కారుచోల సులేమాన్, రషీద్, కొండ మస్తాన్, మస్తాన్‌వలి, మక్బుం, బాషా, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వీరరాఘవస్వామి



వాహనంపై ఊరేగుతున్న స్వామి

చీరాల అర్బన్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో గల వీరరాఘవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిత్య హోమం, ప్రాతరోపాసన, బలిహరణలు నిర్వహించారు. రాత్రి వేదవల్లి కనకవల్లీ సమేత వీరరాఘవ స్వామి దేవతామూర్తులను హనుమంత వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీఎల్ కుమార్ పర్యవేక్షించారు, అర్చకస్వామి దిట్టకవి వాసుదేవాచార్యులు, యాజ్ఞీకులు తాళ్లూరి వెంకటేష్ ఆచార్యులు అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయంలో అన్నాభిషేకం



పుష్పాభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

చినగంజాం: స్థానిక గంగా పార్వతి సమేత చిదంబరేశ్వర దేవస్థానంలో నూతన జీవ ధ్వజ స్తంభ సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ పరాశరం రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వాస్తుహోమంతో పూజా కార్యక్రమాలను ప్రారంభించి నమక, చమక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నకూటోత్సవం నిర్వాహణగావించారు. పూజలో పలువురు దంపతులు పాల్గొనగా దూర ప్రాంతాల నుంచి పలురకాల పుష్పాలను తెప్పించి శాస్త్రోక్తంగా పూలతో అభిషేకం నిర్వహిస్తూ ఘనంగా పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి పడిపోయి తీవ్రగాయాల పాలైన ఘటన ఆదివారం సాయంత్రం మార్టూరులో చోటు చేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ అందించిన సమాచారం ప్రకారం దర్శికి చెందిన కే ప్రసాద్‌రెడ్డి తన బైకుపై విజయవాడలో పరీక్ష రాసి తిరిగి తన గ్రామానికి వెళ్తున్నాడు. మార్టూరు చైతన్య స్కూలు సమీపంలో జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కాగా అతనిని 108 సిబ్బంది చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం దుకాణం సూపర్ వైజర్ చేతివాటం

చినగంజాం: ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన చేతివాటం ప్రదర్శించి మద్యం బాటిళ్లు అమ్ముకున్నాడు. ఈఘటన ఇంకొల్లుపోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇంకొల్లు ఎస్సై షేక్ నాయబ్ రసూల్ వివరాల మేరకు.. ఇంకొల్లు-పర్చూరు రోడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న మార్టూరి వెంకట ప్రశాంత్ వైన్ షాపులోని 42 మద్యం సీసాలను అక్రమంగా బయటకు తరలించాడు. తాను దొంగిలించిన మద్యం సీసాలను అధిక ధరకు అమ్మి లాభం గడించేందుకు 4 వతేదీ రాత్రి ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు వద్ద ఉన్నాడు. ఎస్సైకు అందిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ పీ సుధాకరరావు, తన సిబ్బందితో ప్రశాంత్‌ను పట్టుకొని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నాడు. ఈ మేరకు అతనిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపాడు.

ఒక్క ఖాతా.. భవిష్యత్‌కు నావ

- ఆడబిడ్డలకు వరం సుకన్య సమృద్ధి యోజన
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



వేటపాలెం: ఆడపిల్ల పుడితే భారంగా అనిపించే రోజులు పోయాయి. ఇప్పుడు ఆడపిల్లలే భవిష్యత్ తరాలకు దిక్సూచిలా ఉన్నారంటే అతిశయోక్తికాదు. కొంచెం వారిని ప్రోత్సహించి దారి చూపిస్తే ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తారు. బాలికల భవితను బంగారు మయం చేసే సుకన్య సమృద్ధి యోజన తల్లిదండ్రులకు వరం లాంటిది. జిల్లా వ్యాప్తంగా లక్షకుపై బడి పదేళ్లలోపు వయస్సు కలిగిన బాలికలు ఉన్నారు. అయితే ఈ పథకం గురించి ప్రచారం లోపం కారణంగా ఎక్కువ మంది వినియోగించుకోవడంలేదు. సమాజంలో ఆడపిల్లపై ఉన్న వివక్షతా భావం పోగొట్టే లక్ష్యంతో 2015 జనవరిలో 'బేటీ బచావో, బేటీ పడావో' (సేవ్ ది గరల్స్ చైల్డ్, ఎడ్యుకేట్ ది గరల్స్ చైల్డ్) పాలసీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా ఉన్న బాలికలల్లో 25 శాతం మంది కూడా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవలేకపోయారు. దీనికి ప్రధాన కారణం ఈ పథకం ఆవశ్యకత గురించి వారి తల్లిదండ్రులకు తెలియకపోవడమే కారణంగా చెప్తున్నారు.

పథకం ఉద్దేశం ఇదే..

అప్పుడే పుట్టిన ఆడపిల్లల మొదలు పదేళ్లలోపు వయసున్న బాలిక వరకూ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఈ ఖాతాను తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకులు తెరవవచ్చు. ఒక కుటుంబంలో ఇద్దరు బాలికలకు వర్తిస్తుంది. ఒకటి లేదా రెండో ప్రసవంలో కవలలు పుట్టిన ఇద్దరు బాలికలు ఉంటే మూడో అమ్మాయికీ ఖాతా తెరవవచ్చు.

పన్ను మినహాయింపు ఉపయోగం..

సుకన్య సమృద్ధి యోజనలో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కూడా పొందవచ్చు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక ఏడాదిలో రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. అందువల్ల ఉద్యోగం చేసే వారికి ఈ స్కీమ్ చాలా అనువుగా ఉంటుందని చెప్పుకోవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన ఇవీ ఉపయోగాలు..

- ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలు ఖాతా తెరిచిన నాటి నుంచి 15 ఏళ్ల పాటు పొదుపు చెల్లించాలి.
- 21 సంవత్సరాల తరువాత వడ్డీతో కలిపి పూర్తి సొమ్ము పొందవచ్చు. లేదా అమ్మాయికి 18 ఏళ్ల వయస్సులో చదువుకు డబ్బు అవసరమైతే ఖాతా నుంచి 50 శాతం మొత్తాన్ని పొందవచ్చు.
- ఖాతాలో మొత్తానికి చక్రవడ్డీ లభిస్తుంది. ఆర్థిక సంవత్సర ఆరంభంలో వడ్డీలో మార్పును ప్రకటిస్తారు.
- ఒక ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కనీస మొత్తం రూ. 250 మొదలు గరిష్టంగా రూ. 1.50 లక్ష వరకు చెల్లించవచ్చు.
- కనీస మొత్తం చెల్లించకపోతే ఏడాదికి రూ. 50 చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తారు. కనీస మొత్తం రూ. 250 చెల్లించి ఖాతాను పునరుద్ధరించుకోవచ్చు.
- ఖాతాలో జమ చేసిన సొమ్ము మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. ఏ తపాలా కార్యాలయంలోనైనా ఉచితంగా తెరవవచ్చు. బదిలీ కూడా చేసుకునే అవకాశం ఉంది.
- సుకన్య సమృద్ధి యోజనపై ప్రస్తుతం 7.6 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఈ వడ్డీ రేటు ఎప్పటికీ ఒకేలా ఉండదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను సమీక్షిస్తూ ఉంటుంది. అందువల్ల వడ్డీ రేట్లు పెరగొచ్చు. లేదంటే తగ్గొచ్చు. కొన్ని సందర్భాల్లో వడ్డీ రేట్లు నిలకడగా కూడా కొనసాగవచ్చు.

> **సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు ఆసరా..**
>
> కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లకు ఆసరానిస్తుంది. ఆడపిల్లల కలిగిన తల్లిదండ్రులు ఈ పథకంలో చేరి వారి చిన్నారులకు మంచి భవిష్యత్ ఇవ్వొచ్చు. మీ గ్రామంలోని పోస్టాఫీసుల్లోగాని లేదా ఏదేని జాతీయ బ్యాంకుల్లో కూడా ఈ పథకం ప్రారంభించుకోవచ్చు. ప్రస్తుతం 7.06 శాతం వడ్డీ లభిస్తోంది. ప్రతి మూడు నెలలకు వడ్డీ మారుతుంది.
>
> ఎల్. శ్రీనివాసరావు, పోస్టుమాస్టర్, వేటపాలెం

పార్టీ అభ్యర్థిని గెలిపించాలి



నాయకులతో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి: వైఎస్సార్ సీపీ బలపరచిన పార్టీ అభ్యర్థిని గెలిపించాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. సంతమాగులూరు మండలంలోని వల్లభా డైరీలో ఆయన ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల గురించి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ నెల్లూరు, చిత్తూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లా పట్టభద్రుల అభ్యర్థిగా శ్యామ్ ప్రసాద్ రెడ్డిని పార్టీ నిలబెట్టిందని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు మన పార్టీ ప్రజలకు చేస్తున్న మేలును పట్టభద్రులకు వివరించి, వారి ప్రథమ ప్రాధాన్యత ఓటును మన పార్టీ అభ్యర్థికి వేసే విధంగా నాయకులు కార్యకర్తలు పనిచేయాలన్నారు. తక్కువ సమయమే ఉందని, అయినా నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నిబంధనల మేరకు ఓటు ఉన్న ప్రతి పట్టభద్రుడిని కలవాలని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి సంబంధించిన వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

చురుకుగా ఈర్లగంగమ్మ సీసీ రోడ్డు నిర్మాణం



నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్డు

బల్లికురవ: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈర్లగంగమ్మ ఆలయానికి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. బల్లికురవ నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పడమర భాగంలో నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో ఈర్లకొండకు ఎగువ భాగంలో ఈర్లగంగమ్మ స్వయంభుగా వెలసింది. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఆలయానికి వెళ్లే దారి 450 మీటర్లు మోకాటిలోతు గోతులతో అధ్వానస్థితికి చేరించి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాలను నక్కబొక్కలపాడు సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య, గ్రామస్తులు ఇటీవల రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య దృష్టికి తెచ్చారు. ఆయన మండల నిధుల్లో రూ. 20 లక్షలు కేటాయించి నిర్మాణ పనులకు సంబంధించి ఇటీవల భూమి పూజ చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ జీ. హనుమంతరావు తెలిపారు. నెలాఖరులోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని ఏప్రిల్ 6న జరిగే తిరునాళ్లకు ఇబ్బందులు లేకుండా చేస్తామని ఏఈ వివరించారు. ఇదే సీసీ రోడ్డులో ఒక కల్వర్టు నిర్మాణం, ఎర్త్‌వర్క్ చేపడతామని చెప్పారు. నిర్మాణ పనులు జరిగే 20 రోజులు భక్తులు, వాహనదారులు సహకరించాలని సర్పంచ్ కోరారు.

మహిళ ఆరోగ్యమే సమాజ శ్రేయస్సు



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, బాలికలు

కారంచేడు: ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు బాగుంటుందని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కే జెస్సీరాణి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కారంచేడు-3 సచివాలయ సిబ్బంది సహకారంతో ఆదివారం మహిళలు, బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్దీ ఉమెన్..హెల్దీ ఇండియా నినాదంతో ప్లకార్డులతో గ్రామంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ, పాత పోలీస్‌స్టేషన్ రోడ్డు, పీహెచ్‌సీ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి మహిళ ధృడంగా ఉండేందుకు జాగ్రత్త పడాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఏ రంగంలోను తక్కువ కాదు అన్నట్లు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జయశ్రీ, జగదీశ్వరీ, నిర్మలమేరి, భవానీ, ఏఎన్‌ఎంలు, ఆశాలు, సచివాలయ సిబ్బంది, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి అమ్మవారికి పూజలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కరణం వెంకటేష్

చీరాల: చీరాల మండలం దేవాంగపురిలోని 24 ముఠాల సేనాధిపతుల ఆధ్వర్యంలో ఆదివారం చౌడేశ్వరి అమ్మవారి జ్యోతిర్మహోత్సవాల పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పృథ్వి ధనుంజయ, దేవేంద్ర, కొలుకుల వెంకటేష్, అద్దంకి రెడ్డి, అంకాలరెడ్డి, బొడ్డు సుబ్బారావు, బీ లీల, మున్సిపల్ కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డైరెక్టర్ల అస్తులు వేలం వేయాలి



నిరసన ర్యాలీ చేస్తున్న బాధితులు

వేటపాలెం: వేటపాలెం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నిధులు గోల్‌మాల్ చేసిన డైరెక్టర్ల అస్తులు వెంటనే వేలం వేయాలని బాధితులు డిమాండ్ చేశారు. సొసైటీ బాధితులకు త్వరగా న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ సొసైటీ నిధులు రూ. 24 కోట్లు గోల్‌మాల్ జరిగి ఏడాదిన్నర దాటినా ఇంతవరకు నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. చీరాల డీఎస్పీ కేసు విచారణ చేపట్టినా నిందితులపై కోర్టులో చార్జిషీట్ వేయకుండా కాలం వెళ్లదీస్తున్నాడని అన్నారు. విచారణను వేగవంతగా పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జాగాబత్తిన రమేష్‌బాబు, పెద్దిరెడ్డి సుధాకర్, కృష్ణమోహన్, గొరాబత్తిన శ్రీనివాసరావు, పింజల మధుసూదనరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గో పూజ



గోపూజ చేస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సందర్భంగా నారాయణస్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, గో పూజ, మహా నివేదన, పల్లకీసేవ తదితర పూజలు చేశారు. మహా నివేదన పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్లు చేతబూని స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ పూజారి సత్యనారాయణశర్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణ రెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం, పబ్బిలేటిపల్లి గ్రామానికి చెందిన గొల్లం శ్రీనివాసులు సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

వీధికుక్కలతో ప్రజల బెంబేలు

- గాయలపాలవుతున్న ప్రజలు



తోటవారిపాలెం కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలు ప్రజలను గాయాలపాలు చేస్తున్నాయి. ప్రతి గ్రామంలోని వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. మేజర్ గ్రామ పంచాయితీలు అయిన ఈపురుపాలెం, వాడరేవు, దేవాంగపురి గ్రామాలతో పాటుగా మిగిలిన తోటవారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, సాల్మన్‌సెంటర్, రామకృష్ణాపురం, విజయనగర్‌కాలనీ, చీరాలనగర్, కొత్తపాలెం తదితర గ్రామ పంచాయితీల్లోని వీధుల్లో కుక్కలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గడిచిన వారం రోజుల్లోనే గ్రామాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన 9 మంది వరకు వీధి కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. కుక్కలు కాటు వేయడంతో టీకాల కోసం ఏరియా వైద్యశాలకు పరుగులు తీస్తున్నారు. గ్రామాల్లో నివశిస్తున్న రోజువారీ కూలీలు కూలీ పనిచేసుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో గుంపులుగా తిరుగుతు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లకు అడ్డుపడుతూ దాడి చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతన్న వీధి శునకాలతో భయాందోళనలు చెందుతున్నామని, వీధి కుక్కలను గ్రామాల నుంచి దూరంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో శునకాల సమస్య లేకుండా చూడాలని ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

హిందూ శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు



ఏర్పాటు చేసిన బోరు

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలోని హిందూ శ్మశాన వాటికకు ఎంపీపీ భుక్యా శాంతిబాయి మండల గ్రాంటు నుంచి విడుదల చేసిన రూ.80 వేల నిధులతో ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. అంత్యక్రియల సందర్భంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామవాసుల కష్టాలను తెలుసుకుని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బోరు మంజూరు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు, పార్టీ నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వలపర్ల, ద్వారకపాడు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడి పందెం శిబిరంపై దాడి

వేటపాలెం: కోడిపందెం శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ శివారులో నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి నిర్వాహకులు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీ సురేష్ ఆదివారం తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆకస్మికంగా దాడులు చేశామని చెప్పారు. ఎనిమిది మందితో పాటు, రెండు కోళ్లు, రెండు ఆటోలు, రెండు మోటార్ బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జే.పంగులూరు: ఉచిత కంటి వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. మండల పరిధిలోని పంగులూరు గ్రామంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు రోటరీ భవనంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 189 మంది వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 106 మందికి శుక్లాల ఆపరేషన్ చేయాల్సిందిగా వైద్యులు నిర్ధారించారు. 35 మందికి సోమవారం శుక్లాల ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు జగదీశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు ఆకాంక్ష, రుతుషా, సోనాలి, కార్యదర్శి కరణం హనుమంతురావు, ట్రెజరర్ పోతిన ప్రసాద్, క్యాంప్ కన్వీనర్ చిలుకూరి వీరరాఘవయ్య, గ్రామ సర్పంచ్ గుడిపూడా నాగేంద్రం, రొటేరియన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చినగంజాం: ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ది ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. స్థానిక పర్చూరు రోడ్‌లోని ఆదర్శ హైస్కూల్ విద్యార్థులకు స్త్రీ, పురుషుల సమానతల సాధనలో స్వాతంత్ర్యం తదనంతర పరిణామాలు అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రావినూతల శ్రీనివాసరావు, హైస్కూల్ కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

పార్కింగ్ కేంద్రంగా తహసీల్దార్ కార్యాలయం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పార్కింగ్ ప్రదేశంగా మారిన ప్రభుత్వ కార్యాలయాల సముదాయం

చీరాల టౌన్: ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతం ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు కేంద్రంగా మారింది. నిత్యం వందలాది మంది చీరాల పట్టణం, గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు వచ్చే తహసీల్దార్, మండల పరిషత్, ఉపఖజానా, హౌసింగ్, ఆర్ అండ్ బీ కార్యాలయాలు ఉన్న ప్రదేశం కాస్తా వివిధ రకాలు భూముల రిజిస్ట్రేషన్, షాపింగ్‌లకు చీరాల వచ్చిన వారి వాహనాలతో నిండిపోతుంది. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సబ్ రిజిస్టార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్లు, కూరగాయల మార్కెట్‌లో కొనుగోలుకు వచ్చిన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను తహసీల్దార్ కార్యాలయం ముందు నిలుపుదల చేయడంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలస్థాయి అధికారులు స్పందించి చీరాల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రైవేటు వాహనాలు నిలుపకుండా చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.